సాక్షి రంగారెడ్డి

మంగళవారం। 30। మే। 2023



ఓవర్‌టేక్ చేయబోయి..

ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొని బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. 8లో▸

ఫార్మాసిటీ ఠాణాకు ఏర్పాట్లు

యాచారం: నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీ ఠాణా ప్రారంభానికి చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఐ లింగయ్య సోమవారం నక్కర్తమేడిపల్లిలోని ఓ అద్దె భవనాన్ని పరిశీలించి, యజమానికి అద్దె రుసుం కూడా చెల్లించారు. అద్దె భవనంలో గదులను శుభ్రం చేయించారు. రెండు రోజుల్లో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ చేతుల మీదుగా ఠాణా ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు క్రీడా జట్ల ఎంపిక

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి టెన్నికాయిట్ క్రీడా జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, పీఈటీ పరమేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు ఇదే పాఠశాలలో జూన్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న 7వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. వివరాలకు 96404 74819 నంబర్‌లో సంప్రదించాలన్నారు.





సాంస్కృతిక వైభవం

ఆమనగల్లు పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. – ఆమనగల్లు

న్యూస్‌రీల్

నేడు షాద్‌నగర్‌కు ముగ్గురు మంత్రుల రాక

రూ.161.73కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



ప్రారంభానికి సిద్ధమైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

షాద్‌నగర్: నియోజకవర్గం పరిధిలో రూ.161.73 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆయా కార్యక్రమాలకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎక్సైజ్, యువజన క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. నందిగామలో డీఎల్‌ఎఫ్ వద్ద రూ.2కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభోత్సవం, రూ.15కోట్లతో నిర్మించనున్న షాద్‌నగర్ –కేశంపేట రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.45కోట్లతో పాత జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన, షాద్‌నగర్‌లో రూ.1.88 కోట్లతో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం, రూ.95కోట్లతో నిర్మిస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, చటాన్‌పల్లిలో రూ.1.40కోట్లతో సబ్‌స్టేషన్ పనుల ప్రారంభోత్సవం, షాద్‌నగర్‌లో ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఎదురుగా రూ.45కోట్లతో నిర్మించి నైట్‌షెల్టర్ భవన ప్రారంభోత్సవం, షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.కోటితో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు.

1 నుంచి ట్రాఫిక్ కేసులపై మెగా లోక్ అదాలత్

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ కేసుల పరిష్కారానికి జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు చేవెళ్ల కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలో నమోదైన ట్రాఫిక్ పోలీస్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు తీసుకు రావాలని తెలిపారు. ఆయా కేసులను బట్టి జరిమానాలు ఉంటాయన్నారు. ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్లు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ అధికారులకు సూచించారు. ఈ మేరకు సోమవారం సచివాలయం నుంచి చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ హరీశ్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివాహం.. ఏదీ ప్రోత్సాహకం?

చేవెళ్ల మండలం అంతారానికి చెందిన రాజేష్, అశ్విని 2021 డిసెంబర్ 21న కులాంతర వివాహం చేసుకున్నారు. 2022 మేలో ప్రభుత్వ ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వారికి ఏడాది పాప కూడా ఉంది. ఇప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు.

మీర్‌పేటకు చెందిన శ్రవణ్‌కుమార్, విజయలక్ష్మి 2020 నవంబర్ 6న కులాంతర వివాహం చేసుకున్నారు. 2021 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్లుగా కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యారేజ్ సర్టిఫికెట్లతో సాంఘిక సంక్షేమశాఖ అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికీ ప్రోత్సాహకం రాలేదు.

కద్లాల్‌కు చెందిన అరుణ్, కమ్లీ 2019లో కులాంతర వివాహం చేసుకున్నారు. 2020 నవంబర్‌లో ప్రభుత్వ ప్రోత్సాహకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికీ ఎలాంటి సాయం అందలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా కులాంతర వివాహాలు చేసుకున్న 120 మంది ప్రభుత్వం అందించే సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసి రెండేళ్లు దాటినా ఇప్పటికీ వారికి ఆర్థిక సాయం అందకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.



- కులాంతార వివాహానికి అందని ఆర్థిక సాయం
- షెడ్యూల్ట్ కులాల అభివృద్ధిశాఖలో విడుదల కాని నిధులు
- రెండేళ్లుగా ఎదురు చూపుల్లో 120కి పైగా జంటలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పెద్దలను ఎదిరించి, ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులకు ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులాంతర వివాహ పథకం కింద ఆర్థిక సహాయం అందజేస్తున్న విషయం తెలిసిందే. గతంలో రూ.50 వేలు అందజేయగా 2019 సెప్టెంబర్ నుంచి ఈ ప్రోత్సాహకాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. కులాంతర వివాహాలు చేసుకుని కులనిర్మూలనకు పాటు పడుతున్న ఆదర్శ దంపతులకు వీటిని అందజేస్తోంది. 2019లో 47 మంది జంటలకు రూ.1.23 కోట్లు అందజేయగా ఆ తర్వాత మరో 120 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఇప్పటికే 60 దరఖాస్తులను అధికారులు పరిశీలించి.. నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మరో 60 దరఖాస్తులు పరిశీలన దశలో ఉన్నాయి. రెండేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో దరఖాస్తు దారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇక గిరిజన సంక్షేమ శాఖ (ఎస్టీ) ద్వారా ఒక్కో జంటకు రూ.3.10 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తోంది. ఇక్కడా పదుల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఆయా శాఖలకు ఏటా వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో విడుదల కావడం లేదు. దీంతో ఆయా దరఖాస్తుదారులకు ఏళ్ల తరబడి ఎదురుచూపులు తప్పడం లేదు. అధికారులు కూడా ఈ విషయంలో స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

నిధులు మంజూరుకాగానే..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులాంతర వివాహ పథకం కింద 2019 అక్టోబర్ 31 నుంచి ఇప్పటి వరకు 120 జంటలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో ఇప్పటికే 47 మంది జంటలకు ఆర్థిక సహాయం అందజేశాం. మిగిలిన వారికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– రామారావు, జిల్లా అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమ శాఖ



ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌లో సురభి ప్రసన్న విన్యాసం

క్రీడా సంబరం

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2023 పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం రెండో రోజు అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను డీఎస్‌డీఓ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి ఎంపికైన క్రీడాకారులు పోటీ పడుతున్నారని తెలిపారు. ఈ నెల 31న ఫైనల్స్ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిమ్నాస్టిక్స్ కార్యదర్శి బాలరాజు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, శిక్షకులు పాల్గొన్నారు.

రెండో రోజు విజేతలు వీరే..

వాలీబాల్ (పురుషుల విభాగం): సిరిసిల్ల–నిర్మల్ జిల్లాలు పోటీపడగా సిరిసిల్ల విజేతగా నిలిచింది. కామారెడ్డి–నల్లగొండ మధ్య పోటీలో విజేతగా కామారెడ్డి జిల్లా, జనగాం–మహబూబాబాద్ మధ్య జనగాం విజేతగా, కొత్తగూడెం–సంగారెడ్డి జిల్లా మధ్య కొత్తగూడెం విజేతగా నిలిచింది. ములుగు–మేడ్చల్ మధ్య ములుగు విజేతగా, సూర్యాపేట–గద్వాల మధ్య సూర్యాపేట విజేతగా, జగిత్యాల–మంచిర్యాల మధ్య జగిత్యాల జట్టు విజేతగా, ఆదిలాబాద్–పెద్దపల్లి మధ్య ఆదిలాబాద్ జిల్లా విజేతగా నిలిచాయి.

వాలీబాల్ (మహిళల విభాగం): రంగారెడ్డి–నారాయణపేట జిల్లాల మధ్య జరిగిన పోటీలో రంగారెడ్డి జట్టు గెలువగా, సంగారెడ్డి–పెద్దపల్లి జట్ల మధ్య సంగారెడ్డి విజేతగా, వికారాబాద్–సిద్దిపేట మధ్య వికారాబాద్ విజేతగా, మెదక్–మంచిర్యాల మధ్య మెదక్ విజేతగా, కొత్తగూడెం–వనపర్తి మధ్య కొత్తగూడెం విజేతగా, నిజామాబాద్–వికారాబాద్ మధ్య నిజామాబాద్ జట్టు విజేతగా, సిరిసిల్ల–నారాయణపేట మధ్య సిరిసిల్ల జట్టు విజయం సాధించాయి.



వాల్ట్ ఈవెంట్‌లో నిశిక అగర్వాల్



ఫ్లోర్ ఈవెంట్‌లో పవన్

ప్రగతిని దశదిశలా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ఎన్నో అద్భుతాలను సృష్టించింది.. సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగింది.. తెలంగాణ సాధించిన ప్రగతిని దశదిశలా చాటాలి' అని జిల్లా మంత్రి సబితారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా పోడు భూములకు పట్టాల పంపిణీ, గొర్రెల పంపిణీ, న్యూట్రిషన్ కిట్లు, హరితహారం ప్రారంభంతో పాటు కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జూన్ 2న అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ ప్రారంభమయ్యే ఉత్సవాలు జూన్ 22న అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం ఆవిష్కరణతో ముగుస్తాయని చెప్పారు. ఇరవై రోజుల పాటు ఊరూరా పండుగ వాతావరణం కనిపించాలన్నారు. కాళేశ్వరం మాదిరే పాలమూరు రంగారెడ్డిని కూడా పూర్తి చేసి ఈ ప్రాంతానికి తాగు, సాగు నీరు తేవడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కలెక్టర్ హరీశ్, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, మూసీ రివర్ ఫ్రంట్ చైర్మన్ సుధీర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మేయర్లు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి గురుకులంలో డిగ్రీ అడ్మిషన్లు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జూన్ 1 నుంచి మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఉంటాయని వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 1న ఫిజికల్ సైన్స్, బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్ తదితర గ్రూప్‌లు, బీకామ్ (బిజినెస్, ఎనలటిక్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఏ హెచ్‌ఈపీ) కోర్సుల్లో అడ్మిషన్ల కోసం, జూన్ 2న లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ కోర్సుల్లో అడ్మిషన్లకు విద్యార్థులు 9.30 గంటల నుంచి కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాల మొయినాబాద్ మండలం తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతోందని, విద్యార్థులు ఈ అడ్రస్‌కు రావాలని కోరారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ మెమోలు, హాల్‌టికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, 5–10 తరగతులు చదివిన బోనఫైడ్, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాలని ఆయన సూచించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ..

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (నాగర్‌కర్నూల్)లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీయూజీ సెట్–2023లో అర్హత సాధించిన విద్యార్థినులు జూన్ 2న సంబంధిత వివరాలతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. బీఎస్సీ (ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ), బీకాం కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు తమ పదో తరగతి, ఇంటర్మీడియెట్ మెమోలు, టీజీయూజీ సెట్–2023 హాల్ టికెట్, కులం, ఆదాయం, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్‌సైజ్ 10 ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 93903 57980, 79956 60881 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చీటింగ్ సీటు!

- ఇంజనీరింగ్ కాలేజీల అడ్డగోలు దందా
- ఒక్కో సీటుకు రూ.12– 25 లక్షలపైనే
- కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థులకు గాలం
- ప్రైవేటు కన్సల్టెన్సీల ఫోన్ల తాకిడి
- టాప్ టెన్ సీట్ల హామీ.. సీట్ల రిజర్వేషన్
- కౌన్సెలింగ్ కంటే ముందే బాహాటంగా ప్రక్రియ



సాక్షి, సిటీబ్యూరో: కౌన్సెలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందా జోరందుకుంది. ప్రైవేటు ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియ కు తెరలేచింది. కన్వీనర్ కోటా కటాఫ్ కంటే అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీట్ల టెన్షన్ పట్టుకుంది. ఇదే అంశం ఇంజనీరింగ్ కాలేజీలకు కాసులు కురిపిస్తోంది. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కాక ముందే పేరొందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు నిబంధనలు గాలికొదిలి సీట్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. దీంతో కన్వీనర్ కోటా వర్తించని విద్యార్థుల తల్లిదండ్రులకు కన్సల్టెన్సీల ఫోన్ల తాకిడి అధికమైంది. టాప్ టెన్ కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తామని గాలం వేస్తున్నాయి. ఏకంగా కాలేజీలకు తీసుకెళ్లి సీట్లు రిజర్వ్ చేయించడం బహిరంగ రహస్యంగా తయారైంది. కోర్సుల ఆధారంగా సగటున ఒక్కో సీటుకు రూ.12 లక్షల రూ.25 లక్షల వరకు పలుకుతోంది. కొన్ని కాలేజీలు డొనేషన్ల పేరుతో భారీగా వసూలు సైతం దిగాయి. సీటు రిజర్వేషన్ చేసుకొని మరో 20 రోజుల్లో మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తే సీటు ఇస్తామని స్పష్టం చేస్తుండగా, ఇంకొన్ని కాలేజీలు మాత్రం మొత్తం ఒకేసారి నగదు రూపంలో చెల్లిస్తేనే సీటు, విడతల వారీగా చెల్లిస్తే ఆ డొనేషన్ పెరుగుతుందని తేల్చి చెబుతున్నాయి. అందులో సైతం కేవలం నగదు రూపంలోనే చెల్లించాలని, ఆన్‌లైన్ చెల్లింపులను నిరాకరిస్తున్నాయి. సీటు అంశం మాట్లాడేటప్పుడు మాత్రం యాజమాన్యాలు జాగ్రత్తపడుతున్నాయి. సదరు పేరెంట్స్ మొబైల్ ఫోన్లను సెక్యూరిటీలో పెట్టి లోపలికి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నాయి. బేరసారాలు ముగియగానే తక్షణమే రూ.50 వేలు చెల్లించి రిజర్వేషన్ చేసుకునే విధంగా ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

పెరిగిన డిమాండ్

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు మెకానికల్, సివిల్ విభాగాల్లో సీట్లు తగ్గించుకుని, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ కోర్సుల సీట్లు పెంచుకున్నాయి. ఆ సీట్లకున్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ పిల్లలతో ఎలాగైనా కంప్యూటర్ సైన్స్ సంబంధిత కోర్సు చేయించాలని తల్లిదండ్రుల ఆశలు కాలేజీలకు కాసుల పంట పండిస్తోంది.

మూడు విడతలుగా కౌన్సెలింగ్

ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం జూన్ 26 నుంచి ఆగస్టు 9 వరకు మూడు విడతల్లో కౌన్సెలింగ్ జరగనున్నది. తొలి విడత కౌన్సెలింగ్ జూన్ 26 నుంచి, రెండో విడత జూలై 21 నుంచి, తుది విడత కౌన్సెలింగ్ ఆగస్టు 2 నుంచి ప్రారంభం కానున్నది. మూడు విడతల్లో సీట్లు పొందిన వారు ఆగస్టు 8, 9 తేదీల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 8న ప్రైవేట్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల మార్గదర్శకాలను విడుదలవుతాయి. ఇంజనీరింగ్ సీట్లు మిగలకుండా ఐఐటీలు, 'ఎ' ఐటీల్లో ప్రవేశాలకు కల్పించే జోసా కౌన్సెలింగ్‌కు సమాంతరంగా ఎంసెట్ కౌన్సెలింగ్‌ను నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది.

ముందుగానే 'బి' కేటగిరీ సీట్లు

జేఎన్టీయూ పరిధిలోనే 149 కాలేజీలుండగా ప్రైవేటు కాలేజీల్లో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటా ('ఎ' కేటగిరీ) ద్వారా.. మిగిలిన 30 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా ('బి' కేటగిరీ)లో ద్వారా భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేయాలి.. కానీ కన్వీనర్ కోటా ప్రక్రియ కంటే ముందే.. మేనేజ్‌మెంట్ కోటా సీట్ల అమ్మకాలపై యాజమాన్యాలు దృష్టి సారించాయి. మేనేజ్‌మెంట్ల సీట్ల భర్తీలో 15 శాతం సీట్లను ఎన్నారై/ఎన్నారై స్పాన్సర్డ్ కోటాలో కేటాయించాలి. మరో 15 శాతం సీట్ల భర్తీలో జేఈఈ మెయిన్ ర్యాంకర్లకు మొదటి ప్రాధాన్యం, ఎంసెట్ ర్యాంకర్లకు రెండో ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరూ లేకుంటే ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించాలి. కానీ ఇవేవీ అమలు లేకుండా ఇష్టానుసారం ప్రవేశాలకు తెరలేచింది.

గతంలోనూ..

ఇంజనీరింగ్ కాలేజీల్లో మెరిట్‌కు పాతర వేస్తుండగా.. సీట్లు అంగడి సరుకుగా మారాయి. వేలం మాదిరి రోజురోజుకూ డిమాండ్ పెంచి మరీ డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. బ్రాంచీని బట్టి సొమ్ము చేసుకుంటున్నాయి. గతంలో సైతం మెరిట్ కాదు కదా.. అసలు జేఈఈ ర్యాంకు, ఎంసెట్ రాయనివారికి కూడా సీట్ల లభించాయి. ప్రస్తుతం సైతం అదే పునరావృతం కాబోతోంది. టాప్ కాలేజీల్లోనే ఈ అడ్డగోలు దందా ఉండగా మిగతా కాలేజీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

హజ్ యాత్రలో ఇబ్బందులు రానీయం

మంత్రి కొప్పుల ఈశ్వర్

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. యాత్రకు సంబంధించిన అన్ని ప్రక్రియలను హజ్‌హౌస్‌లోనే చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో హజ్ శిబిరం ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా సిబ్బందిని నియమించాలని, ఈ మేరకు విధులను ఖరారు చేయాలని, క్యాంపు నిర్వహణపై వారికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యాత్రకు సంబంధించి లగేజ్, బోర్డింగ్, ఇమిగ్రేషన్, కస్టమ్స్ తదితర అన్ని ప్రక్రియల కౌంటర్లను హజ్‌హౌస్‌లోనే ఏర్పాటు చేయన్నుట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం, సలహాదారు ఏకే ఖాన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లాఖాన్, రాష్ట్ర హజ్ కమిటీ ఈఓ షఫీవుల్లా, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ఓవర్‌టేక్ చేయబోయి..

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకుల మృతి


చంద్రశేఖర్ మృతదేహం


నరేశ్ మృతదేహం


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరగిద్ద బస్టాప్ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్‌లో జాతర ముగించుకొని పల్సర్ బైక్ వస్తున్న ఇద్దరు యువకులు చేవెళ్ల మండలం దామరగిద్ద బస్టాండ్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన కోస్గి చంద్రశేఖర్ (23), వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామానికి చెందిన ఎస్. నరేశ్(17) అక్కడికక్కడే మృతి చెందారు. వీరివురు దూరపు బంధువులు. చంద్రశేఖర్ శంషాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా.. నరేశ్ శంషాబాద్‌కు సమీపంలో ఇంటర్ చదువుతున్నాడు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

- వివాహేతర సంబంధమే ప్రాణం తీసిందా?
- కలకలం రేపిన యువకుడి మృతి ఉదంతం
- అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో మృతదేహం లభ్యం


రాజేష్ (ఫైల్)

హయత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓ యువకుడి మృతదేహం సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించింది. యువకుడిని ఎవరైనా హత్య చేశారా? ఆత్మహత్య చేసుకున్నాడా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లోని డాక్టర్స్ కాలనీ వెంచర్‌లో కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద లబించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతని స్నేహితుడు చైతన్యపురికి చెందిన సాయి ప్రకాష్‌ను పిలిపించి చూపించగా.. మృతదేహం తన స్నేహితుడు అల్లెవుల రాజేష్(24)దిగా గుర్తించాడు. ఘటనా స్థలాన్ని ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించి ఆధారాలు సేకరించారు. రాజేష్ నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా హత్యచేసి ఇక్కడ మృతదేహాన్ని ఇక్కడ పడేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. రాజేష్‌కు ఓ ఉపాధ్యాయురాలితో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఇటీవల ఆమె కుటుంబ సభ్యులు రాజేష్‌ను మందలించినట్లు తెలిసింది. ఈ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్న పోలీసులు అతని స్నేహితులను పిలిపించి విచారిస్తున్నారు. హాస్టల్ సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఆస్ట్రేలియా వెళ్లాలనుకున్నాడు..

ములుగు జిల్లా పంచాక్షులపల్లికి చెందిన అల్లేవుల పరశురాం కుమారుడు రాజేష్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీ హిందూ కళాశాలలో ఇటీవలే బీటెక్ పూర్తి చేశాడు. పైచదువుల కోసం ఆస్ట్రేలియా వెళ్లాలనే ఉద్దేశంతో గత మార్చి నుంచి నగరంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ.. దానికి సంబంధించిన పత్రాలను సమకూర్చుకునే పనిలో ఉన్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు చెప్పారు. వచ్చే నెలలో ఆస్ట్రేలియా వెళతానని చెప్పిన రాజేష్ ఇలా శవమై కనిపించాడని వారు భోరున విలపించారు.

పది రోజుల క్రితమే వచ్చి వెళ్లాడు..

రాజేష్ ఇటీవల రెండు రోజులు తన దగ్గర ఉండి వెళ్లాడని స్నేహితుడు సాయిప్రకాష్ చెబుతున్నాడు. అనంతరం నెల 22న ఇబ్రహీంపట్నం వెళ్లాడని, మరునాడు ఇంటికి వెళతున్నాను డబ్బులు వేయమంటె వేశానని సాయిప్రకాష్ చెప్పాడు. ఈ నెల 26న ఫోన్ చేస్తే రింగయ్యింది కానీ లిఫ్ట్ చేయలేదని 27న ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని తెలిపాడు.

ఈశ్వరమ్మకు ‘వండర్ ఉమెన్’

ఆమనగల్లు: కళా, సాహిత్యం, విద్యారంగాల ఉన్నతికి కృషి చేసిన మహిళలకు హైదరాబాద్‌లోని ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో వండర్ ఉమెన్–2023 అవార్డులు అందించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన దాస ఈశ్వరమ్మ సాహిత్య రంగంలో చేసిన కృషికి వండర్ ఉమెన్ అవార్డు వరించింది. శనివారం రాత్రి నగరంలోని తెలంగాణ సారస్వత భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెకు సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ న్యాయవాది డాక్టర్ కనకదుర్గ ఈ అవార్డును అందించారు.


అవార్డు అందుకుంటున్న ఈశ్వరమ్మ

చికిత్స పొందుతున్న కూలీ మృతి


విజయ(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కూలి పనులకు వెళ్తున్న వాహనం పల్టీ కొట్టి 21మంది కూలీలు గాయపడిన విషయం విదితమే. ఈ నెల 23న ఆదిబట్ల సమీపంలోని బీరప్ప ఆలయం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో విజయ తలకు బలమైన గాయమవ్వడంతో ఆమెకు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచింది. మృతురాలికి భర్త, కుమారుడున్నాడు. బాధితురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి


ఆవు కళేబరం వద్ద రోదిస్తున్న బాధితురాలు

కేశంపేట: పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టెల శంకరయ్య పాడి పరిశ్రమపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. సాయంత్రం పిడుగుపడడంతో రెండు ఆవులు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.1.60లక్షలు ఉంటుందన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడిని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- శృతిలయ కల్చరల్ అకాడమీ వేసవి శిక్షణ ముగింపు

ఆమనగల్లు: విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం ఆలయంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నెలరోజులుగా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సోమవారం ఈ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కడ్తాల్ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌ఆచర్జి అర్జున్‌రెడ్డి, మాడ్గుల జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవితేజ, శృతిలయ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకుడు దార్ల చిత్తరంజన్‌దాస్, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు శేఖర్‌గౌడ్, కృష్ణనాయక్, కౌన్సిలర్ శ్రీకాంత్ సింగ్, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు ఐదేళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం తెలంగాణ మాస్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాస్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జోనల్ అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారుడు నరహరి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


శ్రీనివాసరావును సన్మానిస్తున్న మాస్ మీడియా అసోసియేషన్ సభ్యులు

సీడ్స్ పరిశ్రమలో తనిఖీలు

కొత్తూరు: నందిగామ పంచాయతీ శివారులో ఉన్న నూజివీడు పరిశ్రమలో స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ రామయ్య వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనిఖీల్లో భాగంగా పరిశ్రమలో నిల్వ ఉన్న విత్తనాలు, వాటి వివరాలను పరిశీలించామన్నారు. విత్తనాల నిల్వలు, స్టాకు రికార్డులు సక్రమంగానే ఉన్నాయన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రామయ్య, సిబ్బంది

‘ప్లాట్లు కేటాయించాలని బెదిరిస్తున్నారు’


రాజేంద్రనగర్: కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీలో పది ప్లాట్లు కేటాయించాలంటూ సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌసిగ్ సొసైటీ ప్రతినిధులు ఆరోపించారు. సోమవారం కాటేదాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీకి చెందిన సాయినాథ్‌గౌడ్ మాట్లాడుతూ సొసైటీతో సంబంధంలేని శ్రీనివాస్‌రాజు, అశ్విని అనే వ్యక్తులు గత ఆరు నెలలుగా టీఎన్‌జీఓస్ కాలనీలో తమకు ప్లాట్లు కేటాయించాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తెలుసని తమకు ప్లాట్లు కేటాయించకపోతే సంబంధం లేని కేసుల్లో ఇరికించి అరెస్టు చేయిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లను వినిపించారు. దీనిపై తాము మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఆగస్టులో కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీలో ఉద్యోగులకు ఇంటి స్థలాలను సొసైటీ అధ్యక్షులు అమృతరావు ఆదేశాల మేరకు కార్యదర్శిగా ఉన్న వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అయితే అమృతరావు సంతకాలు తీసుకుని శ్రీనివాస్‌రాజు అనే వ్యక్తి సొసైటీ సభ్యులపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌజింగ్ సొసైటీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై రాజేంద్రనగర్ డీసీపీ, ఏసీపీలను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీనివాసరాజుకు పండుగ రమేష్‌రెడ్డి, నాగప్రకాష్ అనే వ్యక్తులు మద్దతు ఇస్తున్నారని, తమకు డీజీపీ, సీపీ తెలుసునని బెదిరిస్తున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

మతిస్థిమితం లేని మహిళ అనుమానాస్పద మృతి


మౌనిక మృతదేహం

మీర్‌పేట: ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా ధర్మారావుపేటకు చెందిన కాసమోని మౌనిక (24)కు శ్రవణ్‌కుమార్‌తో మూడు నెలల క్రితం వివాహమైంది. మౌనిక మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొన్నిరోజుల నుంచి మీర్‌పేట ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌లో నివాసముండే సోదరి వద్దకు వచ్చి ఉంటోంది. కాగా, సోమవారం ఉదయం మౌనిక అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మౌనికకు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో కొంత కాలం చికిత్స అందించామని, జీవితంపై విరక్తి గతంలో పలుమార్లు ఆత్మహత్యకు యత్నించిందని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వస్తే వివరాలు తెలుస్తాయన్నారు.

కోనేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత


సంజయ్ మృతదేహం

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివ రామాలయం ఆవరణలో గల కోనేరులో పడిన వ్యక్తి మృతదేహం సోమవారం సాయంత్రం వెలికి తీశారు. హైదరాబాద్ నగరంలోని శాలిబండ ప్రాంతానికి చెందిన సంజయ్ (38) పెళ్లి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నాడు. అంతకుముందు స్నానం చేసేందుకు కోనేటిలోకి దూకగా, ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

శంకర్‌పల్లి: ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన పి.నర్సింలు(33) రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య మంజుల సోమవారం శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు

- ఆవును తప్పించబోయి అదుపుతప్పిన బైక్
- ఉపాధ్యాయురాలి మృతి


రోజలత మృతదేహం

మొయినాబాద్: దైవ దర్శనానికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన డి.రోజలత(47) ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తోంది. సోమవారం మధ్యాహ్నం ఆమె తన కొడుకు భరత్‌తో కలిసి బైక్‌పై చిలుకూరు బాలాజీ దర్శనానికి వెళ్తున్నారు. మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో హిమాయత్‌నగర్ సమీపంలోని పిస్తాహౌస్ హోటల్ వద్ద ఓ ఆవు అడ్డు వచ్చింది. ఆ ఆవును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి తల్లీకొడుకులు కిందపడ్డారు. భరత్‌కు స్వల్పగాయాలవ్వగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వారిని స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

లారీని వెనుక నుంచి ఢీకొట్టి..

- యువకుడి మృతి


బాబు(ఫైల్)

చౌటుప్పల్: హైవేపై నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామంలో నివాసం ఉండే గాడ్దుల బాబు(27) ఆదివారం ఉదయం తన సొంతూరు పంతంగి గ్రామానికి వచ్చాడు. అదే రోజు రాత్రి బైక్‌పై తిరిగి కొత్తగూడెంకు వెళ్తుండగా దండుమల్కాపురం శివారులో ఓ లారీ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ లేకుండానే వాహనాన్ని హైవేపై నిలిపాడు. ఈ క్రమంలో బాబు బైక్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అంబులెన్సులో చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలిలో పడిపోయిన క్షతగాత్రుడు